# ఆటోవాలా ఆగం..

- మహాలక్ష్మీ పథకంతో ఉపాధి కోల్పోతున్న వైనం
- తమకు భరోసా ఇవ్వాలని డిమాండ్
- టేకుమట్లలో 150 కుటుంబాలకు ఉపాధి కరువు



బస్సు ఎక్కుతున్న మహిళలు



ప్రయాణికులు లేక వెలవెల పోతున్న ఆటోస్టాండ్

టేకుమట్ల, డిసెంబర్ 15 : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో తమ బతుకులకు గ్యారెంటీ లేకుండా పోయిందని మండలంలోని అటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు టేకుమట్లలో ఆటోలకు గిరాకీ ఉండేది. దీంతో చాలా మంది ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తుండే వారు. టేకుమట్లలో 150 మంది ఆంజనేయ ఆటో యూనియన్ ఏర్పాటు చేసుకుని ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చేవారు. టేకుమట్ల వ్యాపార కేంద్రంగా ఉండడంతో అనేక మంది వెంకట్రావ్‌పల్లి, బూర్నపల్లి, ద్వారకాపేట, రామకృష్ణపూర్(వీ), వెలిశాల, ఓడేడ్, గర్మిళ్లపల్లి, గిద్దెముత్తారం, కాల్వపల్లి, రాఘవాపూర్ గ్రామాల నుంచి అటోల ద్వారా వచ్చి వ్యా పారం చేసేవారు. వాగవతలి 9 గ్రామాలతో పాటు, మొగుళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల నుంచి అనేక మంది రాకపోకలు కొనసాగిస్తుండడంతో ఆటోలకు గిరాకీ ఉండేది.

### మా జీవితానికి భరోసా ఇవ్వాలి



ఆటోనే నమ్ముకుని జీవిస్తున్న తమకు మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో గిరాకీ లేక ఉపాధి కోల్పోతున్నాం. గర్మిళ్లపల్లి- ఓడేడ్ వాగులో మట్టి రోడ్డు పోయకపోవడం, టేకుమట్ల- రాఘవారెడ్డి పేట గ్రామాల మధ్య చలివాగుపై నిర్మించిన వంతెన వరదకు కూలిపోవడంతో గిరాకీ బాగా తగ్గింది. ప్రభుత్వ పథకాన్ని తప్పుపట్టడం లేదు.. కానీ తమ జీవితాలకు ఏదైనా ఉపాధి చూపి భరోసా కల్పించాలి

కర్నె వేణు, ఆటో డ్రైవర్, టేకుమట్ల

### వ్యవసాయ కూలీలుగా మారుతున్న ఆటోడ్రైవర్లు

గర్మిళ్లపల్లి- ఓడేడ్ వాగులో మట్టి రోడ్డు పోయకపోవడం, టేకుమట్ల- రాఘవారెడ్డి పేట గ్రామాల మధ్య చలి వాగుపై నిర్మించిన వంతెన వరదకు కూలిపోవడంతో టేకుమట్లకు రాకపోకలు తగ్గాయి. దీంతో చాలా మంది అటో డ్రైవర్లు వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోలుకోలేని దెబ్బ కొట్టిందని అటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు రోజుకు నాలుగు, ఐదు ట్రిప్పులు కొట్టే అటోలు ఇప్పుడు ఒక్క ట్రిప్పు కూడ కొట్టలేకపోతున్నామన్నారు. టేకుమట్లలో అటో స్టాండ్ వెలవెల పోతున్నది.

### ఆటో ఎక్కుతలేరు..



ఇంతకు ముందు టేకుమట్లకు వచ్చి సామన్లు కొనుక్కోని వెం టనే అటోలో పోయేది. ఇప్పుడు బస్సుల ఉచిత ప్రయాణం అంటే ఆడవాళ్లు ఎవ్వలు ఎక్కుతలేరు. బస్సు కోసం ఎదురు చూస్తున్నరు తప్ప ఆటో ఎక్కుత లేరు. నేను గంట సేపైతంది అటోల మంది నిండితే పోదామని చూడబట్టి. ప్రయాణికులు రాకపోవడంతో అటో పోనిస్తలేడు. మంది లేక ఆటో రాక ఎదురు చూసి అలిష్ట అయితంది. బస్సులు ఎక్కువ నడిచేలా చూస్తే మాకు ఇబ్బంది ఉండదు.

గీద రామ్‌రెడ్డి, ప్రయాణికుడు, గర్మిళ్లపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్‌రావు

## సింగరేణి ఆవిర్భా వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

### భూపాలపల్లి జీఎం బళ్లారి శ్రీనివాస్‌రావు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 15 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో వేడుకల ఏర్పాట్లపై అధికారులతో జీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణకాలనీ సింగరేణి క్రీడామైదానంలో ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌వోటు జీఎం బండి వెంకటయ్య, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం, డీజీఎం రవికుమార్, ఏజీఎం జ్యోతి, డాక్టర్ శ్రీనివాస్, ఐటీ మేనేజర్ రజిని కుమారి, రవికుమార్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 'మై భారత్' యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

### యువజన, క్రీడల శాఖ వరంగల్ జిల్లా అధికారి అన్వేష్

కృష్ణకాలనీ, డిసెంబర్ 15 : మైభారత్ యాప్‌లో భూపాలపల్లి జిల్లాలోని యువతీ, యువకులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు తమ మొబైల్ నెంబర్‌తో పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం సంఘటన్, వరంగల్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చింతల అన్వేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాప్‌లో యువతకు సంబంధించిన అభివృద్ధి, స్వయం ఉపాధి, డిజిటల్ లర్నింగ్, సాంకేతిక నైపుణ్యాత అంశాలు, కెరీర్ గైడెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఈ పోర్టల్ పొందుపరిచినట్లు తెలిపారు. ఆసక్తిగలవారు తమ ఫోన్ నెంబర్‌తో తమ పేరును http//mybharat.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోర్టల్‌లో youth typeలో NYKSను సెలెక్టు చేసుకోని సబ్మిట్ చేయాలన్నారు. ఈ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం, క్రీడా సామగ్రిని పొందడం, యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం ద్వారా ఇతర రాష్ట్రాలను సందర్శించడం, సాంకేతిక శిక్షణా నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ఉపాధి అవకాశాలు, సాంస్కృతిక కళలు, ప్రతిభకు గుర్తింపునిచ్చి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వెళ్లడానికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్వేష్ సూచించారు.


## మేడారానికి అధిక నిధులు కేటాయించాలి

వెంకటాపూర్, డిసెంబర్ 15 : మేడారం జాతరకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించినా రూ.70 కోట్లకు అదనంగా రూ.5 కోట్లనే కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని బీఆర్ఎస్ నాయకుడు నూనె శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. జాతరకు మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలి

### అదనపు కలెక్టర్ డీ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేత

ములుగు టౌన్, డిసెంబర్15 : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ డీ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐజేయూ జిల్లా అధ్యక్షుడు షఫీ అహ్మద్ మాట్లాడుతూ సమాజ సేవ చేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల పిల్లల ఫీజుల విషయంలో పాఠశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు రాయితీ ఇవ్వాలని కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేసినా యాజమాన్యాల్లో తీరులో మార్పు రావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే సంయుక్త కార్యదర్శి చుంచు రమేశ్, జర్నలిస్టులు ఎనగందుల శంకర్, రమేశ్, సునీల్, శ్రీను, సంపత్, ఆవుల వెంకన్న, ఎనగందుల కొమురయ్య, సంగ రంజిత్, సీహెచ్ రాజు, సుమన్, పోలోజు రామ్మూర్తి, శరత్, స్వామి, సృజన్, సంజీవ, మహేందర్, పీ కోటేశ్వరరావు, అనిల్, శంకర్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

## పీఎంఈజీపీ యువతకు గొప్ప అవకాశం

ములుగు టౌన్, డిసెంబర్15 : ప్రధాన మంత్రి ఉపాధికల్పన పథకం (పీఎంఈజీపీ) యువతకు గొప్ప అవకాశం కల్పించిందని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నాగపద్మజ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీఎంఈజీపీ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అర్హులైన యువకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు www.kviconline.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మనోజ్‌కుమార్ పథకానికి సంబంధించిన వివరాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్‌కుమార్, రుణ సలహాదారు రాజేశ్, డీపీఎం సతీశ్, సంబంధిత అధికారులు, యువతీ యువకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నాగపద్మజ

## వరల్డ్ స్కిల్ కాంపిటీషన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలి

### ఎంప్లాయిమెంట్ జిల్లా ఇన్‌చార్జి అధికారి మల్లయ్య

కృష్ణకాలనీ, డిసెంబర్ 15 : జిల్లా, రాష్ట్ర, ప్రీ-నేషనల్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిల్లో వరల్డ్ స్కిల్ కాంపిటీషన్స్-2024 ఫ్రాన్స్‌లో నిర్వహించడానికి షెడ్యూల్ నిర్ణయించినట్లు ఎంప్లాయిమెంట్ జిల్లా అధికారి మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలకు భూపాలపల్లి జిల్లాలోని ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు ఈనెల 20 లోపు https//www. skillindiadigital.gov.in/home. వెబ్‌సైట్‌లో తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ వరల్డ్ స్కిల్ కాంపిటీషన్స్-2024 పోటీలో ఆసక్తి, అర్హత కలిగినా అభ్యర్థులు తమకున్న నైపుణ్యాలతో ఆటోబాడీ రిపేరు, ఆటోమొబైల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, బేకరీ, బ్యూటీథెరపీ, సీఎన్‌సీ మిల్లింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫర్ బిజినెస్ జాయినరీ వంటి 50కి పైగా నైపుణ్యాల్లో పోటీపడవచ్చన్నారు.



బస్ బుకింగ్ రసీదును అయ్యప్ప భక్తులకు అందిస్తున్న సిబ్బంది

## శబరిమలైకి టీఎస్ఆర్టీసీ బస్ బుకింగ్

మహదేవపూర్, డిసెంబర్ 15 : మండలంలోని అయ్యప్ప భక్తులు మహేశ్, తిరుపతి, అనిల్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు అయ్యప్ప భక్తులు శబరిమలై యాత్రకు బస్‌ను బుక్ చేసుకున్నారు. ఆర్టీసీ ఆర్‌ఎం సుచరిత ఆదేశాల మేరకు శుక్రవారం వారికి విలేజ్ బస్ ఆఫీసర్ వేల్పుల చంద్రమౌళి అయ్యప్ప భక్తులకు రసీదును అందజేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. అయ్యప్ప భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శబరిమలై యాత్ర మార్గ మధ్యంలో శ్రీశైలం, మహానంది, కానిపాకం, తిరుపతి, పలని, పంబ, త్రివేండ్రం, కన్యాకుమారి, విజయవాడతో పాటు పలు పవిత్ర క్షేత్రాలను దర్శించే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్‌ను బుకింగ్ చేసుకున్నట్లు అయ్యప్ప మాలధారులు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు చల్ల ఓదెలు, రాజు, సతీశ్, సమ్మయ్య, అభిలాశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సబ్ స్టేషన్‌తో కరెంట్ ఫుల్

### బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో చల్లగరిగెలో నిర్మాణం

చిట్యాల, డిసెంబర్ 15 : బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సాగు నీరు, ప్రజలకు నిత్యవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా 24గంటలు సరఫరా చేసింది. అందులో భాగంగానే నాణ్యమైన విద్యుత్‌ను ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా నూతన సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్‌ను అందజేసింది. అందులో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలోని చల్లగరిగెలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసింది. దీంతో చల్లగరిగెతో పాటు జూకల్, ముచినిపర్తి గ్రామాలకు విద్యుత్ అందతున్నది. గతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ లేక రేగొండ మండలంలోని రేపాక సబ్ స్టేషన్, రేపాక సబ్‌స్టేషన్ ఏర్పాటు కాకముందు చిట్యాల సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసే వారని గ్రామస్తులు తెలిపారు. అప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడి తరచూ పాడై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేది. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2కోట్లతో చల్లగరిగెలో నిర్మించిన సబ్‌స్టేషన్‌తో నాణ్యమైన విద్యుత్ అందుతుందని ఈ ప్రాంత వాసులు చెబుతున్నారు.



బీఆర్ఎస్ ప్రభుత్వం చల్లగరిగెలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్